నవ్విపోదురుగాక...!

ఏ. యస్వీ. రమణారావు.

రెండేళ్ళ క్రితం ... ... నేను ఈ ఊరు బదిలీ అయి వొచ్చిన్నాటికి ... ... రామచంద్రరావుగారికింకా పెళ్లి కాలేదు.

ముక్కూ మొహంవూ తెలియని ఈ వూళ్లో అడుగు పెట్టీ పెట్టగానే మొట్టమొదట పరిచయమయిన్దీ; క్షణాల్లో ఆ పరిచయం ఆత్మీయమై ప్రగాఢమైన స్నేహంగా రూపొన్దిన్దీ... రామచంద్రరావుగారొక్కరొ్తనే.

అప్పటికీ... ... ...

'ఇంత జరిగినా'

ఇప్పటికీ... ... ...

'నా మట్టుకు నాకు'

స్నేహితుడూ, గురువూ, మార్గదర్శీ; నా జీవితంలో... రామచంద్రరావుగారొక్కరే. మన్నిస్తున్నంత మాత్రాన; వయసులో పెద్ద తేడా ఏం లేదు మా యిద్దరికీ. మహాయితే; ఏడాదో ఏణ్ణర్థంవో నేనాయనకన్నా చిన్న.

ఎంచాతో మరి; 'మీరు'ని దాటి 'మీర' లేదు సంబోధన ఇట్నుంచీ అట్నుంచీనూ; ప్రాణంలో ప్రాణంగా కలిసి మసిలినప్పటికీ. ఏ విషయంలో కాని అరమరికన్నదే ఎరగని అరుదైన స్నేహం, గడిపినన్నాళ్ళూను. ఈ మధ్యనే... నాల్నెల్లవుతోందనుకుంటాను... మా యిద్దరి మధ్యా... ... 'కల్యాణి' అడుగు పెట్టిన్తర్వాత కూడా...

మా 'స్నేహం' అణుమాత్రంవూ పడల్లేదు సరికదా... ఇదుగో 'ఊహించని' ఈ 'తుఫాను' వొచ్చీదాకా...

ఇద్దరికి ముగ్గురయి; ఆ అనుబంధం మరింతగా అల్లుకుంది తీవెలు సాగి పూలువూసీ.

చిత్రం ఏవిటంటే... ...

రామచంద్రరావుగారికన్నా చాలా కాలం ముందు నా జీవితంలో తటస్థపడింది 'కల్యాణి'. ఆ అమ్మాయిది మా ఊరే. మా యిద్దరిళ్ళూ పక్కపక్కనే. ఏదోవరస కోసం తీగెలులాగి కలుపుకున్న చుట్టరికం మాట అటుంచి అంతకు మించిన ఆత్మీయతా భావం మా రెండు కుటుంబాల మధ్యా ఎన్నో ఏళ్లుగా. కల్యాణి నాకన్నా నాలుగేళ్లు కాబోలు చిన్న. నేను బియ్యేవొడ్డెక్కిన్నాటికి, కల్యాణి ఇంటర్లోకొచ్చిన్ది. బ్రహ్మాండమైన మార్కులెత్తుకుని సెకన్తాసయిన పిల్లకి అక్కడితో చదువు ఆపేస్తానంటూ మూర్ఖప్పట్టు పట్టుక్కూర్చున్న ఆ అమ్మాయి తండ్రితో యుద్ధంచేసి ఆ అమ్మాయిని ఇంటర్లో జాయిన్చేయించటానికి మా నాన్నగారు పడ్డ అవస్థ. నాకు జ్ఞాపకం. ఉద్యోగం సద్యోగం లేకుండా ఏడాదిపాటు మా ఊరి రోడ్లు సర్వేచేస్తూ నేను బలాదూరుగా తిరిగిన రోజుల్లో; చదువుతోపాటు, అప్పుడే వయసులోకికూడా ప్రమోట్ అయిన కళ్యాణి నా శిష్యురాలు. 'ప్రపంచపు తీరు' మీద అప్పుడప్పుడేవో అవగాహన ఏర్పడుతోన్న వయసు నాది. ఎదిగీ ఎదగని జ్ఞానంతో, తొలి కిరణపు తాకిడికి రేకలు విచ్చుకునే మొగ్గవయసులో కళ్యాణి. లేలేత వెన్నెల సోయగంతో సొగసులు దిద్దుకుంటూ, ఆకు ఆకునా పువ్వు పువ్వునా తళతళలాడే మంచు బిందువులా; పిరుగాలి తాకిడికి చిటారుకొమ్మల పరవశించే చిగురాకు కదలికలా; ఉషోదయపు అలికిడికి ఉలిక్కిపడ్డ తెలిమబ్బు తొలినవ్వులా; ప్రకృతి సౌందర్యాలన్నిటినీ కలబోసి నింపుకున్న విశాలమైన కళ్లల్లోంచి వొలికే వెలుగులు, ఎర్రటి పెదవులపై మెరిసే వెలుతురు పువ్వుల నవ్వులై ముగ్ధమనోహరంగా స్నిగ్ధ సుకుమారంగా వుండే కల్యాణి; ఆ రోజుల్లో నాకు ఆకర్షకమైన కాలక్షేపం. ఒక్కరోజు కనపడకపోతే తోచని స్థితిలో ఏడాదిపాటు కల్యాణితో గడిపిన రోజులు నా గుండెల అట్టడుగున పదిల పరుచుకున్న మధురమైన జ్ఞాపకాలు. చదువుతోపాటు సంగీతమూ, సాహిత్యమూ; గంటల తరబడి సాగే మా కాలక్షేపపు ముచ్చట్లు. మా అత్యంత సాన్నిహిత్యానికి వో నిర్వచనం ఏర్పడే లోపల, ఎదురుచూస్తున్న ఉద్యోగం రావడం; నేను మా ఊరు విడిచిపెట్టేసాను. ఉద్యోగంతో ఊళ్ళుపట్టి పోయిన నాకు, నాలుగేళ్లవరకూ మా ఊరి మొహం చూట్టానికే పళ్లేదు. అప్పుడేనా, మా ఊరెళ్లడాని క్కారణం రామచంద్రరావుగారు పట్టినపట్టు.

తమాషా ఏవిటంటే ...

మా వూళ్లో కొచ్చేన్తవరకూ;

రామచంద్రరావుగారు మాడబోయే అమ్మాయి కల్యాణేని నాకు తెలియకపోవటం.

నాలుగేళ్ల తర్వాత మళ్లీ కల్యాణిని, రామచంద్రరావుగారి పెళి చూపుల్లోనే, చూట్టంపడిన్ది.

నేనెరిగిన వెలుతురు మొగ్గ సహస్ర కిరణాల కాంతుల్ని అణువణువునా పొదుగుకుని విరిసిన ముద్ద మందారంలా, ముగ్ధసింధూరంలా, మచంద్రరావు

గారి నిర్ణయం కోసం తలవంచుకుని, అప్పుడే తెంపి తెచ్చిన ముద్దబంతి పువ్వులా, కూర్చున్న కల్యాణిని చూసి; ఆత్మీయతతో, అవ్యాజమైన అనురాగంతో, నా గుండె తడిసి ముద్దయిపోయింది. మా రామచంద్రరావుగారి మంచి మనసుకి కల్యాణిలాంటి అమ్మాయి తోడుకావటం, ఇద్దరికిద్దరూ చేసుకున్న అదృష్టంవేసుకున్నాను మొట్టమొదటి క్షణంలో.

కల్యాణిన్చూసిన వెంటనే వో నిర్ణయానికి రాలేకపోతే, ఎవడికయినా, వాడి జీవితంలో వాడికి, పెళ్లి అనేది శుద్ధదండుగయిన విషయం.

తిప్పకుందామన్నా కళ్లు తిప్పకోలేనంత అసభ్యతకి ఏ మగాణ్ణయినా లోనుచేసేంత అద్భుతమైన సౌందర్యం కల్యాణిది.

రామచంద్రరావుగారికీ, కల్యాణికీ, పెళ్లిచూపులనే తతంగం 'ఆదే ప్రారంభం.

పెళ్లిచేసుకోవాలన్న నిర్ణయం వొచ్చీరాగానే, ఏర్పాటయిన మొదటి పెళ్లిచూపుల్లోనే, అంత అందమైన అమ్మాయి తటస్థపట్టంతో, ఎగిరి గంతెయ్యలేదుగాని అంత పనీచేసారు రామచంద్రరావుగారు, పెళ్లిచూపులయాక మా యింటికొచ్చి.

కళ్యాణి 'అదృష్టవంతురాలు' అనుకున్నాను రామచంద్రరావుగారి నిర్ణయం విన్న క్షణంలో.

రామచంద్రరావుగారి హడావిడి ఇంతా అంతా కాదు. ఏ విషయం కయినా వొక్క నిముషం ఆలస్యం చేయనిస్తేనా ? ఉదయం చూట్టంవూ, మధ్యాహ్నం మాటాడుకోటంవూ, సాయంకాలంకల్లా తాంబూలాలు పుచ్చేసుకుని ముహూర్తాలు నిర్ణయం చేసుకోటంవూ క్షణాలమీద జరిగిపోయాయి ఆ వొక్క రోజులో.

నెల తిరక్కుండా పెళ్లీ అయిపోయింది.

ఇట్నుంచీ అట్నుంచీ కావలసినవాణ్ణవటాన్న; పెళ్లికి రెండువేపులా పెత్తనం అంతా నాదే. నా సలహా లేకుండా, నన్ను సంప్రదించకుండా, పెళ్లి మొత్తంలో ఎంత చిన్న వ్యవహారంవూ జరగలేదు. పెళ్లయిన వారంకల్లా; కొత్త దంపతులకి, ఇల్లు చూట్టం దగ్గిర్నుంచీ కొత్త కాపరంకి కావల్సిన సరంజామా అంతా నా చేతులమీదే ఏర్పాటయింది. భార్యాభర్తలు కొత్త ఇంట పాలు పొంగించినపూట, వాళ్ల కాపరంలో విస్తరేసిన మొట్టమొదటి అతిథిన్నేనే.

అలా; మా రామచంద్రరావుగారి భార్యయినంత మాత్రంచేత, చిన్నప్పణ్ణుంచీ ఎంతో చేరికయిన కల్యాణిని 'ఏవండీ'నిగాని 'మీరూ'నిగాని పిలవటం ఎందుకనోమరి ఎంతో ఎబ్బెట్టుగామా, చాలా కృతకంగామా అనిపించింది. ఆ చిన్న విషయానికి వో ప్రాముఖ్యం ఇవ్వటం మాటటుంచి, దాన్నిగురించి పట్టించుకోనేలేదు రామచంద్రరావుగారు. ఆ దృష్టే లేదు కల్యాణికి.

కాపరం మొదలెట్టిన నాల్రోజులిక్కాబోలో రోజు రాత్రి భోజనం చేసి హోటలు మెట్లు దిగుతో, సాయంకాలపు షికారునుంచి తిరిగొస్తోన్న కొత్త దంపతుల కెదురుపడేప్పటికి, రామచంద్రరావుగారి కేం ఆలోచనొచ్చిందోమరి —

"రేపట్నుంచి మీరు మాతోపాటే మా యింట్లోనే వుంటారు" అన్నారు నన్ను చూస్తూనే.

ఆయనేదో మాటవరస కన్నట్లుగా ఎంచి తేలిగ్గా నవ్వేసాన్నేను.

"మేం సీరియస్‌గానే చెప్తున్నాం" 'కదు కల్యాణీ' అన్నట్టు భార్యవేపు చూస్తూ అన్నారాయన.

"అవునండీ...అయినవాళ్లం మేం వుంటోండగా ఈ దిక్కుమాలిన హోటలు కూడు ఇంకా తినటం ఏం బాఁవోలేదు." భర్త ప్రతిపాదనని సమర్థిస్తూ అన్న కళ్యాణి మాటలకు;

"అనవసరంగా శ్రమెందుగ్గానీ... ఇంకేవన్నా కబుర్లు చెప్పండి..." అని తప్పించుకోబోయాను.

"షడ్రసోపేతమైన హోటలు భోజనం వొదులుకుని మాతో చారూ మెతుకులు తినటం మీకు శ్రమే మరి..." నిష్ఠూరంగా అంటోన్న కల్యాణిని అడ్డుకుని;

"అదికాదు కల్యాణీ..." నచ్చచెప్పబోతున్న నన్ను మరి మాటాణ్ణీకుండా;

"ఇంక మరేం చెప్పకండి సోది. తెల్లారేసరికి, మీరు మీ పెట్టెబేడాతోసహా వొచ్చి మా ఇంట్లో వుంటారు. మీకోసం ముందు గది ఖాళీ అయి సిద్ధంగా వుంటుంది. అంతే. పద కల్యాణీ..." అంటూ వెళ్లిపోయారు నన్నలా రోడ్డుమీదొదిలేసి.

మొండికేస్తే, రామచంద్రరావుగారి సున్నితమైన మనస్తత్వం ఏ విపరీతంకి దారితీస్తుందో; ఆయనతో రెండేళ్ల సన్నిహితత్వంలో నేను బాగా ఎరిగున్న విషయం. ఆయనతో వ్యవహారాలలానే వుంటాయి. ఏ నిర్ణయానికీ అంత తొందరగా రారాయన. వొచ్చేరా ఏమాత్రం తేడాపాడా వొచ్చినా నిలదొక్కుకోలేరాయన. ఆ గాయం నుంచి వొకంతట తేరుకోలేరు. చాలా అనుభవాలే అయాయి నాకు. ఏఁవయితే అదయిందని, మొండికెత్తి, వాళ్ల నిర్ణయానికి తలవొగ్గకుండా వుంటే... షా జీవితాల్ని ఊహించని మలుపులకు తిప్పే... ఈ సంఘటన... జరిగుండేది కాదేవో ననిపిస్తోందిప్పుడు.

ఊహించలేకపోయాం ముగ్గురిలో ఏ వొక్కరంవూ.

రామచంద్రరావుగారిని నొప్పించకూడదనే కారణం వొక్కటే; ఆ తెల్లారేసరికి వాళ్లిద్దరి మధ్యకీ నన్ను లాక్కెళ్లింది.

నా రాకతో, రామచంద్రరావుగారి మొహంలో సంతోషంవూ... కల్యాణి కళ్లల్లో వెల్తురూ గమనించాను, వొచ్చిన మొదటి క్షణమే. పాలూనీళ్లల్లా కలిసిపోయాం ముగ్గురికి ముగ్గురంవూ.

ఆ నెలాఖర్న మాత్రం చిన్న పేచీ వొచ్చింది.

ఇద్దరికిద్దరూ ఏకంవయి నా నోరు మూయించావున్నారు.

అక్కడ మాత్రం బెసకలేదు నేను.



277 F-122 TEL

చిన్నసైజు యుద్ధం తర్వాత, నన్ను 'పేయింగ్ గెస్టు'గా వొప్పించగలిగాను చివరికిద్దర్నీ.

బస్. ఆ అంగీకారం కుదిరిన మరుక్షణం నుంచీ ఆ దృష్టేలేదు మాలో వొక్కరికీ.

ఏ విషయంలోగాని ఎలాటి అరమరికల్లేవు మా మధ్య.

వొక్కరాత్రి పడుకునేటప్పుడు తప్ప అస్సలు ఎడంవనేదే లేదు.

కబుర్లు, షికార్లు, సినిమాలు, వోహ్... రోజులకి రోజులు తెలీకుండా. సరదాగా ఏదైనా విషయంలో చర్చ అంటూ మొదలెడితే, వాదనే వొస్తే, కల్యాణీ నేనూ వో పక్షం అయిపోయి, రామచంద్రరావుగార్ని పూర్వ పక్షం చేస్సే వాళ్లం.

నేను లేకుండా భర్తతో వాదనలోకే దిగేది కాదు కల్యాణి.

చాలా విషయాల్లో ... చెప్పకేం... రామ చంద్రరావుగారి పాయింట్ సబబుగా వుండేది. పూర్వాపరాలాలోచించిగాని... ఏ విషయంలోనూ... వో నిర్ణయానికి రారాయన. ... ఇదిగో... ఇప్పుడు ఆయన తీసుకున్న... ఘోరమైన నిర్ణయంలో తప్ప... అసబబుగా ప్రవర్తించేది లేదెప్పుడూ ఆయన. కల్యాణిది వొఠి మొండి వాదనా, ఊక దబాయింపూనూ; ఎంత చిన్న విషయం కానీ...తన జీవితమార్గాన్ని తనే నిర్ణయించుకోవాల్సొచ్చిన వొక్క ఈ దుర్ఘటనలో తప్ప. కల్యాణిని సమర్థించు కొచ్చి ఆమె మొండివాదనలో ఆమెన్నెగ్గించటానికి నాకు తల్ప్రాణం తోక్కొచ్చేది. విచిత్రం ఏఁవిటంటే, తన వాదనలో ఎంతో బలంవున్నప్పటికీ, చివరికొచ్చే సరికి, భార్య ముందు వోడిపోయే వారాయన. ఆ సంగతి పసిగట్టిన నా వేపు 'అదంతే'నన్నట్టు చిరు నవ్వుతో చూసేవారాయన. వోడిపోవడం వో ముచ్చట కొంత మందికి.

నా ఆసరా చూసుకుని తెగ దబాయించేది ఆయన్ని కల్యాణి.

అతిలోక సౌందర్యంగా వుండే పెళ్లాంతో పేచీ పెట్టుకోవటం వో సరదా ఆయనకి.

తన మాట నెగ్గించుకుంటున్నంత మాత్రాన, భర్త ఎడల ఏ మాత్రం చులకన భావం కన బరిచేది కాదు కల్యాణి. సరదా కోసఁవే వాదన. కాలక్షేపం కోసఁవే పేచీ. ఊసుపోవడం కోసఁవే తగూలాట.

ఆ గడిచిన క్షణాలన్నీ గుండెల అడుగున దాచు కున్న మధురజ్ఞాపకాలు.

అలా కాలం కదలకుండా నిలబడిపోతే...

ఆ స్వర్గం తొణక్కుండా శాశ్వతమయిపోతే...

ఆ వరం వొక్కటి తప్ప మరేవీ కోరు కోకుండా...

సాగిపోతోన్న మా జీవితాలని...

ముచ్చటగా మూణ్ణెల్లు కాకుండానే ఊహించని మలుపుకి తిప్పి; తిరిగి మరి జన్మలో బయటకు రాలేని సుడిగుండంలోకి; రామచంద్రరావుగారిని నిర్దాక్షిణ్యంగా తోసేసి పోయింది కాలం.

ఏ మలుపు అయినా బ్రతుకుని అందల మెక్కిస్తే బాధలేదు అగాధంలోకి తోసేస్తేనే తప్ప.

ఆ అగాధంలోకి నన్ను తోసేసి పోయినా ఇంత బాధ వుండేది కాదు.

నవ్విపోదురుగాక ..

'నా' కారణంగా రామచంద్రరావు గారి జీవితం తల కిందులవుతుందన్నది నేనూహించనిది. తెలి సుంటే 'వాళ్ల' జీవితాల్లోకి చొరబడుండే వాణ్ణి కాదు.

సులువుగా కల్యాణి తట్టుకోగలిగింది కానీ... ఊహించని సంఘటనకి ఒకంతట నిలదొక్కుకో లేకపోయినా... ఇద్దరికిద్దరమూ... ఆ క్షణం తీసు కున్న కఠినమైన నిర్ణయాన్ని చాలాసేపు సమర్థించ లేకపోయాను, నేను. అంతగా ప్రాణంలో ప్రాణంలా మసిలిన రామచంద్రరావుగారి మూర్ఖమైన పట్టు దలని; వ్యతిరేకించటానికి గల వొక్కే వొక్క కారణం;

కల్యాణి జీవితం తెగిన గాలిపటం ఐ సంఘపు కోరల్లో చిక్కుకో కూడదనే !... నడవడికలో, జీవన విధానాల్లో, ఆలోచనల్లో, అలవాట్లల్లో, ఆచరణల్లో; రామచంద్రరావుగారిని 'మార్గదర్శకంగా' ఎంచుకున్న నేను; నాకు కాబోయే భార్యనెన్నుకునే విషయంలో కల్యాణిని 'ఆదర్శంగా' తీసుకోడంవల్ల;

దేహం - దేశం

శరీరాంతర్భాగాలనే చూడండి
నిజానికి చూడలేరనుకోండి
గుండె—మూత్రపిండాలు—జీర్ణకోశం... అన్నీ
మంచినే స్వీకరించి
చెడును త్యజించే
బహుసాత్వికులు
మరి... శరీరాన్ని... శాసించేది ?
సాత్వికులు కావు
చెడుకు తఱచు తలవంచే
చంచలమైన — మనస్సు !
దేశముగతీ... అంతే
దేశంలో మేధావులగతీ ఇంతే.

— నల్లాన్ చక్రవర్తుల శేషాచార్లు

నా కోసం నడుంకట్టుకుని, మావాళ్లు తీసుకొస్తున్న, సంబంధాలొక్కటీ, నచ్చట్లేదు నాకు. చూసిన ఏ అమ్మాయన్నా నా 'ప్రామాణికం'కి, కనీసం దగ్గరగా వున్నా, నా పెళ్లెప్పుడో అయిపోయేది. 'ఈ జన్మకిహ వీడికి పెళ్లవదు కాబోలు' నన్నస్థితికి, విసుగెత్తి పోయారు మా వాళ్లంతా. పట్టువదలని విక్రమా ర్కుడిలా, సాగిస్తూనేవున్నాను పెళ్లి చూపుల తతంగాలు.

ఆరోజు ....

నా సహనాన్ని మరోసారి పరీక్షించిన వో పెళ్లి చూపుల వ్యవహారాన్ని ముగించుకుని మా వూర్నుంచి వొచ్చిన్నన్ను గుమ్మంలోనే అడ్డుకుని;

''కాయ ? పండా ?'' ని, ఎప్పట్లానే అడిగిన కల్యాణిని చూసి;

''కాయా'' పాత పాటే పాడుతూ, లోపల కొస్తోన్న, నా వెనకే విసురుగా వొచ్చి;

''ఇంకా ఎందరమ్మాయిల్ని చూస్తారు మహా ప్రభూ ?'' విసుగ్గా అడిగింది కల్యాణి.

''ఏం చెయ్యమ్మని ? నాకు నచ్చిన అమ్మాయింకా కంటబడన్దే'' అన్నానవ్వుతూ.

''ఎవరా ఊహా ఊర్వశి మహానుభావా ?''

''ఊహ కాదు. ఉద్దేశంలో వున్న అమ్మాయి కోసఁవే నా వెదుకులాటంతా.''

''దొరక్కపోతే ?''

''పెళ్లి కాపోతే వొచ్చినష్టఁవేం లేదు''

''పెళ్లిళ్లు చేసుకున్న మొగధీరులంతా, కాక ముందు ఇలా ప్రగల్భాలు పలికిన వాళ్లే.''

''చూస్తూ వుండలా''

''చూడకేంగానీ ... మీ ఉద్దేశాల్లో ఊపిరి సలపకుండా నలిగిపోతోన్న ఆ అమ్మాయి పోలిక లేవిటో చెప్పండి మహాశయా ... కళ్లల్లో కాగడాలు పెట్టుకున్నేనూ వెతుకుతాను.''

''పోలికల్చెప్పటం ప్రారంభిస్తే వో పెద్ద కావ్యమే అవుతుందది.''

''కావ్యం చదవొద్దుగానీ ఆ కావ్యనాయిక ఎవరో చెప్పండి బాబూ''

''చెప్పాకా ... పారిపోవు కదా ?''

''అంత భయంకరంగా వుంటుందా మీ కథా నాయకి ?''

''అసూయపడతావేఁవోనీ''

''అసూయపడేనంత అందమైన ఆ అమ్మాయి ఎలా వుంటుందేవిటి ? ఎక్కడుందేవిటి ?''

''ఇక్కడే''

''ఇక్కడా ?''

''ఊఁ నాకళ్లల్లో''

''ఎవరో చెప్పండి బాబూ, చంపకా''

''నేను చేసుకోబోయే అమ్మాయి, రూపంలో... గుణంలో... లక్షణాల్లో... చెప్పేయనా...?''

''ఊఁ వేగం...''

''మా కల్యాణిలా ....''

నా మాటింకా పూర్తికాలేదు;

అంతవరకూ మా సంభాషణంతా, మాక్కన బడకుండా, వరండాలో పొంచుండి వింటోన్న; రామచంద్రరావుగారు హఠాత్తుగా లోపలకొచ్చారు.

''అదేవిటి ... మీరింకా ఇంట్లోనే ఉన్నారను కున్నాను ......''

ఆయన్ని చూడగానే ... చాలా అనాలోచితంగా అన్న నా వంక తీక్షణంగా చూసి ; మౌనంగా లోపలి కెళ్లిపోయారు రామచంద్రరావుగారు.

ఆయన ఆ సరికొత్త ప్రవర్తన మొట్టమొదటి సారిగా గమనించిన నేనూ, కల్యాణీ క్షణంసేపు నిశ్చేష్ఠులం అయిపోయాం.

ఆయనలో ఆ 'పురుగు' అంతకుముందే ప్రవే శించిందన్న విషయం తరవాత్తర్వాత్తెలిసింది. ఆ రోజు మా సంభాషణ, దాని 'ఉనికి'ని మరింత విస్తృత పరిచింది.

''విన్నారా ... మన ఔరంగజేబుగారు మరో దండయాత్ర కొట్టొచ్చే ... ''

మరుక్షణంలో మామూలుగా అయి, ఆయన

వెనకే లోపలకెళ్తూ అంటోన్న కల్యాణిని ఇంకో మాట మాటాణ్ణీకుండా;

"ఆ కథలన్నీ వింటూ కూర్చోటానికిక్కడెవరూ తీరిగ్గా లేరుగానీ ముందు నాకు భోజనం వొడ్డించు" కల్యాణితోనేకాదు ... ఎవరితోన్నా ... రామచంద్రరావుగారంత కఠినంగా మాటాడుతోండగా వినటం అదే మొదటిసార్నాకు.

"ఏవయిందిప్పుడూ ? ఎందుకంత చిరాకూ?" అడుగుతోంది కల్యాణి.

"ప్రతిదానికీ నీకు సంజాయిషీ చెప్పుకోవాలా ఏం ? వొడ్డించు వేగం నా కవతల పనున్ది."

"వొడ్డించటానికీ, నేనింకా వంటే మొదలెట్లేదు."

"పెత్తనాలు మొదలెట్టావుకదా, నీకింకేం గుర్తుంటుందీ ?"

"ఆదివారాల్లో వొంటిగంటక్కాని భోజనం చెయ్యని మీరు పదకొండన్నాకాకండా వొచ్చి వొడ్డించీ మంటారన్నే నూహించనా? బైటికెళ్లేముందేవన్నా చెప్పెళ్లారా?"

"ప్రతీదీ నువ్వు చెప్పే చేస్తున్నావా ?"

"చెయ్యకూడని పన్లేం నేన్చెయ్యటం లేదు. అయినా నేనన్నదేవిటీ ? మీరడుగుతోన్దేవిటీ ?"

"అనవసరంగా వాగక. నా కసలే చిరాగ్గా వుంది.

రామచంద్రరావుగారంత కఠినంగా మాట్లాడ గలరని కలలోకూడా ఊహించన్నేను అక్కడ ఇంకో క్షణం వుండలేకపోయాను. వున్నవాణ్ణున్నట్టు లేచి బయటకొచ్చేసాను. ఏం చెయ్యాలో తోచక, చిరాగ్గా నిలిచినచోట నిలబడలేక, ఊరంతా తిరిగాను చాలా సేపు. చాల్రోజుల్తర్వాత, అడుగుపెట్టేన్నన్నుచూసి, హోటలు ప్రొప్రయిటరు ఆశ్చర్యపోయాడు. భోజనానికోటిక్కట్టియ్యమనడిగినప్పుడయితేమరీనూ.

సహించని అన్నం కెలుకుతూ కూర్చున్ననన్ను;

"ఇదేవిటి మళ్లీ హోటలు పట్టేవూ ?"

నా వ్యవహారాలన్నీ బాగా ఎరిగున్నవాళ్లు టేబుల్ దగ్గరకొచ్చి, మొహంలో మొహంపెట్టి మరీ, పలకరింపుగా అడిగినప్పుడు; జీవంలేని వో నవ్వు వాళ్లకి సమాధానంగా నవ్వి, లేచి, చేతులు కడుక్కుని, బైటికొచ్చేసి, కొంతదూరం వచ్చేసాక, టేబుల్ మీద కళ్లద్దాలు మరిచిపోయానన్న సంగతిగుర్తొచ్చి, మళ్లీ హోటల్లోకి వెళ్లి, భోజనాలకోసం ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన గదిలో కడుగుపెట్టబోతోవుండగా, ఆ చిన్నగదిలోంచి, ఇందాకట్లా పలకరించిన ఇద్దరిలో ఒకడు ...

"పూర్వాశ్రమంలో ఆ రామచంద్రరావుగాడి పెళ్లాం వీడి ప్రేయురాల్ట గురూ. వీడిదీ దాన్దీ వొకే వూర్లే. వీడితో కొంతకాలం గ్రంథం సాగించిన్తర్వాత, ఏవయిన్దో మరీ, ఈ రామచంద్రరావుగాడితో పెళ్లయింది. వాడూ వీడూ బంకలా అంటుకు తిరుగుతార్లే. ఆ రామచంద్రరావుగాడో మఫ్. మొగుణ్ణడ్డం పెట్టుకుని పాత్రప్రియుడితో వ్యవహారం సాగిస్తోన్దది. దాన్ని మధ్యలో పెట్టుకుని తెగ తిరుగుతార్లే వీళ్లిద్దరూ. ఆ మధ్యోరోజు సినిమాలో చూసాన్లే దానికి వాడటూ వీడిటూ. ఇంటర్వెల్లో పెళ్లాన్ని వీడికప్పచెప్పేసి వాడెళ్లి పోయాడు గురూ. వెనకసీట్లోనే వున్నానేవో. వీళ్లు మరి సినీమా చూళ్లేదనుకో. వొకళ్లమీద కొకళ్లు వాలిపోయి, అంటుకుపోయి, సాగించిన సరసాలు చూడాలీ ... " వింటున్న నాకు నరనరంలో రక్తం మరిగిపోయింది. ఆ కారుకూతలు కూస్తున్న వాడిని అక్కడికక్కడే తవ్వి పాతేద్దావన్నంత కోపం గుండెల్లోంచీ తన్నుకొచ్చింది.

"వీడికి పెళ్లి పటాకులూలేవా ?" అవతలి వాడు అడిగిన్దానికి;

"కొబ్బరి ముక్కలాంటి గుంట అప్పనంగా దొరుకుతూ వుంటే పెళ్లెందుకురా పెదనాన్నా'ని..." అంతే నాకు మరి వొళ్లు తెలీ లేదు. వాడి రక్తం కళ్లచూడాలని, గదిలోకడుగు పెట్టేసరికి...

"వొచ్చారాసార్... ఇదిగో మీ కళ్లజోడు... తీసి పెట్టుంచాన్సార్." అంటూ సర్వరడ్డొచ్చాడు. ఆ మాటలకి, నోటికొచ్చినట్టు పేలుతున్నవాడు వెనక్కి తిరిగి నన్ను చూసేసరికి, వాడి మొహంలో రక్తం ఇంకిపోయింది. వాణ్ణి కొట్టినా, రోడ్డున మొరిగే కుక్కని కొట్టినా, వొకటే ననిపించి, ఆ వెదవ్వంక అసహ్యంగా చూసి; నా వివేకం కోల్పోకుండా కాపాడిన సర్వరు వంక కృతజ్ఞతతో చూసి, కళ్లజోడందుకుని బయటకు వచ్చేసాను.

బుర్రని దొలిచేస్తోన్న ఆలోచనలతో, ఏం చెయ్యాలో తెగక, తిరుగుతోనే వున్నాను ఊరంతా. ఎదురుపడ్డ వాళ్లంతా 'శంకిస్తున్నట్టే' చూస్తున్నట్టనిపించారు. వేలెత్తి హేళన చేస్తున్నట్టే కనిపించారు. తుచ్ఛమైన భావాలకు తావులేని పవిత్రమైన మా ముగ్గురి 'అనుబంధానికి' ఎన్ని చిలవలు పలవలు కల్పిస్తోందీలోకం అని చుట్టూ మసిలే ప్రపంచం మీద ఖాండ్రించి వుమ్మేయ్యాలన్నంత అసహ్యం ఏర్పడింది మొట్టమొదటిసారిగా. లోకం మాటలావుణ్ణీ. మనసావాచా నా స్వభావాన్ని అణువణువునా ఆకళింపు చేసుకున్న రామచంద్రరావుగారు కూడా లోకం దృష్టితోనే చూస్తున్నారన్న తలంపు వొచ్చినప్పుడల్లా బాధతో దహించుకుపోయాను.స్వచ్ఛమైనపువ్వులా, లోకమెరుగని పాపనవ్వులా, ఏపాపంవూ ఎరగని 'కల్యాణి' మీద అనుమానాన్ని పెంచుకో కలిగేంత అవివేకపు స్థితికి రామచంద్రరావుగారూ దిగజారిపోయారాన్న ఆలోచనకలిగినప్పుడు నిలువెల్లా కంపించేపోయాను. ఇంకా ఉపేక్షించి కల్యాణి మనుగడని మరింత సంక్లిష్టం చెయ్యడానికి ఇంకో క్షణం అయినా వొప్పుకోలేదు మనసు. వెంటనే వాళ్లిద్దరి మధ్య నుంచీ తప్పుకోవాలి. అంతేకాదు; రామచంద్రరావుగారి అనుమానపు కోరలు వాడెక్కకముందే, వాటి బారినపడి కల్యాణి బ్రతుకు ఛిన్నాభిన్నం కాకముందే; నా 'ఆదర్శాన్ని' 'అభిమతాన్ని' పక్కకు బెట్టే తక్షణం, ఎలాంటిదోలాంటి అమ్మాయితో నా పెళ్లి జరిగిపోవాలి వారం తిరిగే లోపల. ఆఫీసరు కాళ్లూ వేళ్లూ పట్టుకుని బ్రతిమలాడయినా ఈ వూర్నుంచి ట్రాన్స్ఫర్చేయించుకుని, నా ఉనికే తెలియనంత దూరం వెళ్లిపోవాలి.

ఆలోచన అక్కడికి తెగిన మరుక్షణంలో, మరో క్షణం ఆలశ్యం చెయ్యకుండా ఇల్లు చేరేటప్పటికి, చాలా రాత్రయిన్దారోజు.

భార్యా భర్తలప్పటికింకా పడుకోలేదు.

వీధి గది తలుపులు తీసుండటం మూలాన్న, పిలవ్వల్సిన అవసరం లేకుండా, నా గదిలోకొచ్చి, లైటువేస్తే నేనొచ్చినట్లు తెలుస్తుందని, చీకట్లోనే బట్టలు మార్చుకుంటున్నాను...

"అతనొక్కక్షణం ఈ ఇంట్లో వుంటానికి వీల్లేదు...వీల్లేదు...వీల్లేదు." రామచంద్రరావుగారి గొంతు వీధిలోకి వినపడేటంత బిగ్గరగా.

"ఆ ముక్కేరాగానే చెప్పండాయన్తో" పరిశీలనగావింటే తప్ప వినపణ్ణంత నెమ్మదిగా, కల్యాణి.





''నాకేం పట్టలేదు చెప్పటానికి.''

''రా రమ్మని పిలిచిన్ది మీరా? నేనా? పిలిచిన వాళ్లే చెప్పాలి పొమ్మని''

''నాకదన్నా తెలీదు.''

''నాకూ తెలీదయితే.''

''తెలీదంటే నమ్మట్లేదు లోకం.''

''ఇప్పటికీమాట చాలాసార్లన్నారు మీరు...''

''నేననటంకాదు... లోకంవంతా కోడై కూస్తోంది...''

''లోకంతోపాటే మీరూనా ?''

''నిప్పు లేకుండా పొగ రాదుకదా...''

''నిజంగా నిప్పే గనక వుంటే... వుట్టి పొగ కాదండీ... ఆకాశాన్నంటే మంటే లేస్తుంది... ఆ అగ్నిశిఖ ముందు నిలబడే దమ్ముండదు మళ్లీ ఈ లోకానికి. ఎవళ్ల అంతరాత్మని వాళ్లు మోసం చేసుకోకుండా పవిత్రంగా వున్ననాడు... ఈ లోకం కూసే కారుకూతల్ని లెక్కచెయ్యక్కర్లేదు.''

''తెగించినవాళ్లకు ఎవడేం అనుకుంటే ఏం ఖాతరూ... ?''

''తెగించటం అంటే అర్థం... నిజంగా 'తెగించినప్పుడు' తప్ప తెలీదండీ.''

''తెలియచెయ్యడానికే సిద్ధపడ్డావన్న మాట చివరకీ...''

''సహిస్తున్నకొద్దీ... ఆ సహనాన్నింకా పరీక్షిద్దామన్నావేస్తే...''

''చూస్తే... చూస్తే ఏంచేస్తావు... ఏంచేస్తావే... బరితెగించి వాణ్ణి తీసుకుని లేచిపోతావా...''

''ఆపండి... ఆపండి... ఆపండి. ఈ ముక్కే మరోళ్లెవళ్లేనానుంటే... వాళ్ల రక్తం కళ్ల చూసేదాన్ని... తాళి కట్టిన భర్త అయిపోయారు గనకా, ఇంకా ఆ సంప్రదాయాన్ని గౌరవిస్తున్నాను. అంత మాట అన్నా మీమీద ఇంకా నాకు మిగిలిన పూజ్యభావాన్ని దయచేసి పోగొట్టుకోకండి...''

''నోర్మూయ్... నీతులు వల్లించకు. వాడిమీదే 'రోకుం'దని ఆరోజే ఏడ్చుంటే నిక్షేపంగా వాడికే వొదిలేసుండేవాణ్ణి. నోరు మెదపడానికి మళ్లా గుండెలు చాలేయికాదు ఆరోజు. నన్నడ్డం పెట్టుకుని, చాటుమాటుగా, పాగినన్నాళ్లు సాగిద్దామన్నావసే రిద్దరికిద్దరూ. నా కళ్లు కప్పినా లోకం కళ్లు కప్పలేకపోయావు. విజం బైటపడ్డాక... తెగించడానికి సిద్ధపడ్డావు. నా రక్తం కళ్ల చూసయినా వాడితో లేచిపోదామనుకుంటున్నావు. అలాంటి నువ్వా... తాళి, భర్త సాంప్రదాయం అంటూ నీతులొలకబోస్తే... ఇంకా నమ్మేంత వెర్రికుట్టిని కాదే. కొద్దోగొప్పో హృదయం వున్న మనిషిని గనకా, మర్యాదగా వాణ్ణే పొమ్మనమ్మన్నెప్పమంటు న్నాను... గతం మరిచి కుదురుగా కాపరం చేసుకోమంటున్నాను. జుత్తు పట్టుకుని బయటకీడ్చియాల్సిందిపోయి, దయతో క్షమిస్తున్నకొద్దీ నోటికొచ్చినట్టు మంచిచెడ్డా మరిచి మరీ పేలుతున్నావు. వీధిలోకి గెంటేస్తే నీ బ్రతుక్కేగతి పడుతుందో ఆలోచించుకుని మరీ మసులుకో... ఈమాత్రం దయ కూడా చూపించరెవళ్లూ...''

''దయ! మీకున్నది దయ కాదండీ...నా శరీరం మీద మోజు.''

నవ్విపోదురుగాక...

''మోజుపడే చేసుకున్నానే... నీ మోజంతా వాడిమీదున్నట్లేకా...''

''ఎవడో కూసిన కారుకూతతప్ప ఆ ముక్కన్నాటికి మీకున్న ఆధారం వొక్కటంటే వొక్కటి చెప్పండి ?''

''సవాలక్ష ఆధారాల్లో ఏదన్చెప్పమంటావే ?''

''వున్నాయున్నాయనటంకాదు. చెప్పండి ?''

''చెప్తే, అగ్నిప్రవేశం చేసేసి పాతివ్రత్యాన్ని ఋజువుపరిచేసుకుంటావేంటి సీతాదేవిలా కొంప తీస్పి...''

''యుగయుగాల్నించి ఎంతమంది సీతలు అగ్నిప్రవేశం చేస్తేమట్టుకు మీ రామచంద్రుళ్ల అనుమానాగ్ని చల్లారింది గనకా ?''

''నీమీద మాత్రం అనుమానమేంలేదు నిక్షేపమైన నమ్మకం తప్ప.''

వాళ్ళకేం తెలుసు?

నా దేశాన్ని
పాలిస్తున్నది
శాసిస్తున్నది
''రాహువులు!''
''కేతువులు!''
వాళ్ళకేం తెలును ?
మా ''క్షుద్బాధ'' ఎంత
భయంకరంగా ఉంటుందో
మా ''మేధాసంపత్తి'' ఎంత
ఘనంగా ఉంటుందో !

— కె. కిశోరుబాబు
కె. అశోకుబాబు

''ఆహా అంత నమ్మకం వున్నవాళ్లా మళ్లీ ఏలుకుంటాననటమెందుకో ?''

''తప్పు చేసినా, సహృదయంతో క్షమించగలిగే, మానవత్వం.''

''హుం. మానవత్వం! 'తాళి' కట్టేననే అహంకారంతో, అభం శుభం తెలియని ఆడపిల్లల్ని 'అనుమాన పిశాచం'తో, చిత్రహింసలు పెట్టే ఈ దేశపు 'మొగుళ్ల' 'అమానుషత్వం' అది...''

''ఏవిటే నీ పొగరూ... ఎవణ్ణి చూసుకునే నీ మిడిసిపాటు... ఊరుకుంటున్నకొద్దీ నోటికొచ్చినట్టు పేలుతున్నావు... ఔట్... గెటౌట్... ఇంకొక్క క్షణం నా కళ్లముందుంటే నిన్నూ... నిన్నేం చేస్తానో నాకే తెలీదు... పో... పోయి వాడితోటే ఊరేగు... పోవే......''

ఊరు ఊరంతా వినపడేలా గావుకేకలేస్తూ, అలగాజనం కూడా ప్రవర్తించనంత అసభ్యంగా, మెడమీద చెయ్యేసి, అమానుషంగా, గెంటుకుంటూ వొచ్చి, గదితలుపులు భడాల్నతీసి, రామచంద్రరావుగారు రాక్షసంగా తోసేసరికి, ఆ విసురుకి, వీధి గదిలోకి తూలి పడబోయిన కల్యాణి, తలుపుల వెనకే నిలబడ్డ నన్ను ఆసరాచేసుకుని, నిలదొక్కుకుంది.

తలుపులు తెరవగానే కనబడిన నన్నూ... రెప్పపాటులో నా చేతుల్లో వొదిగున్న కల్యాణినీ... చూసేసరికి; రామచంద్రరావుగారిలో అప్పటికే పూర్తిగా రాజుకున్న 'అనుమానం' అగ్నిపర్వతంలా భళ్లన బ్రద్దలయింది. చాలా సేపట్నుంచి, ఆసక్తిగా ఆ గొడవ వింటోన్న, ఇరుగూ పొరుగూ, రామచంద్రరావుగారి అరుపులకి, వీధి గుమ్మంముందు, క్షణాలమీద పోగయ్యేరు.

మా యిద్దరి ముందూ ......

అనుమానంతో, కుత కుత లాడిపోతోన్న రామచంద్రరావుగారూ;

మా వెనక ....

అది రాజేసిన లోకం.

చుట్టూ చీకటి.

లేనిదోషం అంటగట్టబడిన, నిరపరాధుల్లా ...

మధ్యలో మేం ఇద్దరమూ.

తన ముందున్న 'అనుమానం'కి, 'వెన్నెముక'గా, నిలబడ్డ జనాన్ని చూసేసరికి, ఆ బలంతో పూర్తిగా రెచ్చిపోయి, వివేకాన్ని కోల్పోయిన రామచంద్రరావుగారు, నిప్పులు కురిసే కళ్లతో ......

''ఇంకేం ... సిద్ధంగా కాసుకునే వున్నాడన్నమాట ... ఆ ధైర్యంతోనే, నోటికొచ్చినట్టు పేలుతున్నావన్నమాట... తెగతెంపులు చేసుకోడానికే తలపడి, కాపలా వుంచేవన్నమాటా... శబ్బాష్ ... ఇంకేం, కుక్కల్లా వీధిన పడండిద్దరూ ... పొండి... నా గుమ్మంలోంచి ముందు బయటకు నడవండి ...'' వొళ్లు మరచి కేకలు వేస్తున్నంతసేపూ, 'నన్ను' నేను అణగదొక్కుకుని, ఆయన 'ఆవేశం' ఊపిరి తీసుకునేందుకు ఆగిన క్షణంలో; నా చేతుల్లో వడగాలికి వొడిలిపోయిన చిగురుటాకులా, పెనుతుఫాను తాకిడికి దిక్కుతోచని పూలతీగెలా, క్రుంగిపోతున్న కల్యాణిని, ఆయన దగ్గరకు తీసుకెళ్లి;

ఆధారంలేని అనుమానంతో, అర్థంలేని ఆవేశంతో, మిమ్మల్ని మీరు మరిచిపోయి, లేనిపోని అభాండాలేస్తున్నారు రామచంద్రరావుగారూ ... ఆగండి ... వొక్క నిముషం మాటాణ్ణియండి నన్ను ... కల్యాణిది మా ఊరేని, మా రెండు కుటుంబాల మధ్యా ఎన్నో ఏళ్లుగా సాన్నిహిత్యం వుందనీ, ఇవాళ మీకు కొత్తగా ఎవరో వచ్చి చెప్తే తెలిసిన విషయం కాదు కదా... వొకే వూళ్లో పక్కపక్క ఇళ్లల్లో కొన్నేళ్లుగా మసిలినప్పుడు వయసులో పెద్ద తేడాలేని వో అమ్మాయి, వో అబ్బాయి మధ్యనున్న కేవలం స్నేహం, చనువూని ఇవాళ, ఇన్నేళ్ల తర్వాత, ఎవరో వెధవలు భూతద్దంలో మీకు చూపించి 'బూతు' అంటగడితే, నమ్మేసి; మీరే సర్వస్వం అన్నమ్ముకుని, అయినవాళ్లనీ ఎన్నో ఏళ్ల ఆప్యాయతల్నీ వొదులుకుని, ముక్కూ మొహం తెలీని మీ వెంట నడిచొచ్చిన అభం శుభం తెలీని అమ్మాయికీ ... మాటల్లో, మనసులో ప్రాణంలో ప్రాణంగా మసిలిన స్నేహితుడికీ ... ఎవడో పనీ పాటూలేని వెధవ పనిగట్టుకుని ఏదో కూస్తే, అది పట్టుకుని 'నీచంగా' ఊహించుకుని, లేనిపోని సంబంధం అంటగట్టి, నీచాతి నీచంగా మాట్లా

ట్బ్రవేగాకుండా, అగ్నిసాక్షిగా కట్టుకున్న పెళ్లాన్ని అమానుషంగా వీధిలోకి తోసెయ్యటానికీ, మీ సంస్కారం ఏ మట్టిలో కలిసిపోయింది రామచంద్రరావుగారూ ? మీకు దేనిమీద నమ్మకం వుంటే దానిమీద ప్రమాణం చేసి చెప్తున్నాను ... మాయామర్మం తెలీని వయసులో, పక్క ఇంటిలోనే వున్న అమ్మాయిగా, కేవలం పరిచయం, స్నేహం తప్ప కల్యాణి మీద ఎప్పుడూ మరో భావంగానీ, ఆ దృష్టిగానీ, నాకు లేవు గాక లేవు. కల్యాణిలాంటి అమ్మాయి భార్యగా లభించటమనేది ఎవరి జీవితానికయినా అపురూపమయిన వరం. లేనిపోని అనుమానాలతో ఆ వరాన్ని కాలదన్నుకోకండి. తన బ్రతుకు టద్దంలో మీ రూపే నిలుపుకున్న ఈ అమాయకురాలి జీవితం అల్లరిపాలు చెయ్యకండి రామచంద్రరావు గారూ ......''

ఆ రోజల్లా మధనపడ్డ నా మనోవేదన, అణుచుకోలేకపోతోన్న ఆవేశం, కట్టలు తెంచుకుని గుండెల్లోంచి పెల్లుబికిన మాటల వెల్లువే అయింది. మనసు విప్పి నేను మాట్లాడిన ప్రతీ మాటా వో చల్లటి మంచుబిందువై, రామచంద్రరావుగారిలో సెగలు పొగలు గ్రక్కుతోన్న అనుమానాగ్నిని చల్లార్చి, కల్యాణి కాపరాన్ని నిలబెడుతుందన్న కొండంత ఆశా, అందుకునే చేసిన విశ్వప్రయత్నమూ, ముక్కచెక్కలయిపోయింది. నేను మాటాట్టం ఆపిన మరుక్షణం ...

''అయిందా నీ ఉపన్యాసం ? నా కళ్లు కప్పి ఇంకా మీ వ్యవహారం సాగించుకోటానికి చెప్పాల్సిందేవన్నా మిగిలుందా ? మరో మాటమాట్లాడినా... ఇంకో క్షణం నా కళ్లముందు నిలబడ్డా ... ఏం జరక్కూడదో అంతా జరుగుతుంది. అందుకు నేనేం చెయ్యిచేసుకోక్కర్లేదు ...మిత్రద్రోహంతో కాపరాలు కూల్చే నీలాంటివాళ్లని నరికిపోగులెయ్యడానికి లోకం వో కన్నేసేవుంటుందెప్పుడూ. అజ్జరక్కుండా ముందిక్కణ్ణుంచి ప్రాణాలతో బయటపడు. చూడూ ... దయచేసి మరోళ్ల బ్రతుకుల్నీ ఇలాగే మంటగలపకు ... వెళ్లు ... వెళ్లిక్కణ్ణుంచి ... ''

అంతమంది ముందు, చెయ్యన్నేరానికన్ని మాటలన్నందుకు...ఇంకోళ్లూ ఇంకోళ్లూ అయితే... ఆ రోజు నా చేతుల్లో వాళ్ల తలలెగిరిపోయుండేది. రామచంద్రరావుగారుగాకాక, కల్యాణి భర్తగా, ఆ క్షణంలో బ్రతికిపోయాడాయన. నా తొందరపాటు కల్యాణి బ్రతుకునెక్కడ ముక్కలు చేస్తుందోన్న భయం నన్ను పిరికివాణ్ణి చేసింది. రామచంద్రరావు గారన్న వొక్కోమాటకీ, నరనరాల్లోనూ ఉడుకెత్తి మొహంలోకి తన్నుకొచ్చిన రక్తపు ఉధృతాన్ని అతి కష్టంమీద అణగదొక్కుకోవాల్సివొచ్చింది. అయినా, చెయ్యన్నేరానికి, అన్ని మాటలూపడి మౌనంగా వెళ్లిపోడానికి నా ఆత్మగౌరవం ఎదురు తిరిగింది. అందుకే ... చివరగా ...

''చూడండి రామచంద్రరావుగారూ ... చెయ్యన్నేరానికి, మీరన్ని మాటలన్నా, ఏం చాతకాక వూరుకుంటున్నాననుకోకండి. చేసింది తప్పుకాబట్టే నోరుమెదిపే గుండె ధైర్యంలేక తలొంచుకువెళ్లిపోతున్నాడని మీరనుకుంటే, అది–మిమ్మల్ని మీరింకా మోసం చేసుకోవటమేనని గ్రహించండి. నేనే తలుచుకుంటే మీరూ, మీ గుడ్డిలోకం ఏకమై ఎదురొచ్చినా ఎదుర్కోగలిగే నా సత్తా ప్రదర్శించటానికి క్షణం సేపుపట్టదు. కల్యాణిమీద నాకున్న అపారమైన గౌరవం ఒక్కటే నన్ను అశక్తుణ్ణి చేసిందీక్షణంలో. వెళ్తున్నాను ... కళ్లకి అనుమానపు పొరలు కమ్ముకున్న మిమ్మల్నీ, మీకు బలంగా నిలబడ్డ లోకాన్నీ చూసి భయపడి మాత్రం కాదు. భర్తల అనుమానానికీ, అమానుషానికీ, నిర్దాక్షిణ్యంగా బలయిపోతున్న 'కల్యాణి'లాంటి నా దేశపు 'స్త్రీ'ల స్వచ్ఛత' మీద భక్తితో తలవంచి నమస్కరిస్తూ వెళ్లిపోతున్నాను. వెళ్లే ముందొక్క మాట ... 'స్త్రీ'ని గౌరవించలేనివాళ్లు ఈ దేశంలోనేకాదు ఏ దేశంలోనయినా పశువులకన్నా హీనులు. అందునా నా దేశపు 'స్త్రీ'కున్న పవిత్రత ఈ ప్రపంచంలో ఏ దేశపు స్త్రీకీలేదు. ఆ స్త్రీలను గౌరవ పరిచే పశుప్రాయులు కాకండి ... శెలవ్ ... '' చెప్పదలచుకున్నది చెప్పేసి తేలికపడ్డ మనసుతో అక్కణ్ణుంచి శాశ్వతంగా వెళ్లిపోవడానికి వెనక్కు తిరుగుతోన్న క్షణంలో.

''ఆగు ... '' రామచంద్రరావుగారి అరుపుకి ఆగి, వెనక్కి తిరిగాను.

కల్యాణి అదేచోటులో నుంచునుంది.

లోపలికెళ్లటానికి వీల్లేకుండా గుమ్మాని కడ్డంగా రామచంద్రరావుగారు.

ఈ చోద్యం అంతా ఆసక్తిగా చూస్తూ వీధి గదిముందు క్షణక్షణానికీ పోగవుతున్న జనం. వెనక్కి తిరిగిన నా కళ్లల్లోకి సూటిగా చూస్తూ ...

''కల్యాణి అంత స్వచ్ఛమైనదా ... ''

అడిగిన రామచంద్రరావుగారి గొంతులో హేళన. చూపులో వ్యంగ్యం.

పదిమందిలోనూ 'పంచాయితీ' జరుపుతోన్నట్టు ఆయన అడగటం చూస్తే వొళ్లు మండింది.

''ఏ మచ్చా మచ్చుకైనా లేదంటావయితే...''

నా మౌనాన్ని ఆసరా చేసుకుని మరింత వేళాకోళంగా అడిగినదానికి; కల్యాణి తలెత్తి చివ్వున చూసిన చూపులోని తీవ్రతకి అక్కడికక్కడే ఆయన మసికావల్సింది.

భార్య 'పవిత్రత'ని పదిమందిలోనూ నిలబెట్టి ప్రశ్నించగలిగే భర్త.

ఆ సర్వాధికార పట్టం వొక్కపురుషుడికే కట్టబెడుతూ వొచ్చిన యుగయుగాల చరిత్ర.

ఆ అహంకార రాక్షసత్వానికి తరతరాలుగా బలయిపోతున్నా నోరుమేదిపే ధైర్యంలేని ఈ దేశపు స్త్రీ.

అన్ని విధాలా 'అభ్యుదయం' సాధించామని విర్రవీగుతూ చెప్పకునే 'మగజాతి' స్త్రీని అగౌరవ బరచటంలో 'ఆటవికదశ'లోనే వుందని చెప్పటానికి 'రామచంద్రులు' ఇప్పటికీ కోకొల్లలు.

ఆ 'జాతి లో జన్మించినందుకు సిగ్గుపడటంతో సరిపోదు. సమయం వొచ్చినప్పుడు పురుషుడికి పురుషుడే 'స్త్రీ' గురించి సరైన సమాధానం చెప్పాలి. నాకెందుకని నోరు మూసుకోవడమంత 'ఆత్మన్యూనత' మరొకటిలేదు. ఏది ఎలా జరిగినా ఆ 'ప్రశ్న'కి సరైన సమాధానం చెప్పాలనే నిర్ణయించుకున్నాక, వెనకా ముందూ ఆలోచించలేదు.

''చూడండి రామచంద్రరావుగారూ... మీరు హేళనగానే అడిగినా... మీ భార్య గురించి మీకు చెప్పవలసి రావటం నా అదృష్టం. కల్యాణి గురించి చెప్పవలసి వచ్చినందుకు గర్విస్తూ చేస్తున్నాను.





మీరూ మీ బూజుపట్టిన లోకవూ గుండెధైర్యంతో వినండి... ఆకాశం నుంచి అప్పుడే పుట్టి రాలిపడ్డ మంచు బిందువుకన్నా, ఆ మంచుబిందువులో విశ్లేషించి బ్రతుకుని సార్థక పరుచుకోడానికే తూర్పు దిశన తొలిసారిగా జన్మెత్తిన ఉదయ కిరణం కన్నా స్వచ్ఛమైనదీ... లోకమెరుగని పసిపాపనవ్వుకన్నా పవిత్రమైనది మా కల్యాణి. చాలా...?''

కల్యాణి ఎడల నా మనసులోగల అపారమైన గౌరవాన్ని నిస్సంకోచంగా నిర్భయంగా చెప్పింది విని;

''చాలు. కళ్యాణి పట్ల నీ కుండే 'మోజు'ని బయటపెట్టడానికి ఆ మాత్రం చాలు...'' అంటూ కల్యాణి వేపు చూసి. ''చెప్పవే... నువ్వూ చెప్పు వాడి గురించి నీ గుండెల్లో పొంగిపొర్లే ప్రేమని వాడికన్నా వేడిగా...'' చాలా వ్యంగ్యంగా రామచంద్రరావు గారడిగిన మాటకి;

ఈ చోద్యం అంతా ఆసక్తిగా చూస్తూ వినోదిస్తున్న జనంలో నవ్వులు, గుసగుసలు, కలకలం. అప్పుడు చండప్రచండమైన కోపంతో కళ్యాణి కళ్లల్లో కురిసిన నిప్పులవర్షంకి మగజాతి సమూలంగా మాడి మసి అయిపోవాల్సిందే.

''చెప్పమంటారా? చెప్తే విని తట్టుకోగల చేవుందా మీకూ?'' స్త్రీలోకం సమస్తమూ కల్యాణి గొంతులోంచి గర్జించినట్లయింది.

''అయ్యో... విన్నారుకదా... చూసారుకదా వొకళ్లమీద వొకళ్లకున్న వ్యామోహం...'' పోగయిన జనాన్నుద్దేశించి అంటూ, కళ్యాణివేపు తిరిగి...

''ఎవళ్లకుంటుందే? మొగుడిచాటున పరాయి మొగాడితో 'రంకు' సాగించే నీలాంటి ఆడపిశాచాన్ని తట్టుకోగలిగే చేవ ఏ మగాడికుంటుందే...'' అంటూ నావేపు చూస్తూ...

''ఏమన్నావు? ఆకాశం నుండి రాలిపడ్డ మంచుబిందువా? నువ్వా... కొంపలు కూల్చే

నవ్విపోదురుగాక...

చలిపిడుగువి... అవునా? పరాయివాడి పెళ్లాం గురించి వాడిక్కూడా తెలియనంతగా చెప్పగలవన్న మాట. స్త్రీలను ఉద్ధరించటానికి నువ్వొక్కడివే కంకణం కట్టుకుపుట్టావన్నమాట ఈ దేశంలో...''

జనంలోంచి పెద్దపెట్టున నవ్వు. ఆ అండ చూసుకుని మరింత రెచ్చిపోయి...

''అంత ధైర్యం వుందేం నీకూ? ఇంతమంది సమక్షంలో, ఇదిగో దీన్ని వదిలేస్తున్నాను. మొగుడొదిలేసిన ఆడదాన్ని... మంచుబిందువో, పువ్వో, నవ్వో, వల్లకాడో ఏదో అన్నావే ఆ ఆడదాన్ని... ఏదీ జన్మంతా నెత్తిని పెట్టుకుని పూజించే గుండెధైర్యం వుందా... వుందిరా నీకూ? వున్నా లేకున్నా ఈ క్షణంతో దీనికి నాకూ ఎలాంటి సంబంధమూలేదు. పోవే... వాడితోటే పోతావో... వాడు ఛీ అంటే వాళ్లాటవాడే మరోడు మరోడు... ఎంతమంది లేరూ? అవసరం తీరేక వొదిలేసే వెధవలు ... వెంకోణ్ణి మార్చుకున్నా వొంట్లో బిగువూ కండల్లో కావరవూ వున్నంత కాలమూ వెళ్లిపోతుందే... ఆ తర్వాత కుక్క బ్రతుకే. మొగుణ్ణి మోసంచేస్తే ఆడదాని బ్రతుకంతేనే... పో...ఈ జన్మలో నీ మొహం చూపించకు మళ్లీ...''

ఎంత అధికారంవున్నా, ఏ మొగాడూ, వో ఆడదాని గురించి, మాటాడనంత నీచంగా; కట్టుకున్న పెళ్లాన్ని, చెయ్యన్నేరానికి, అనరాని మాటలన్నీ అని; తలుపులు ధడాల్న మూసేసి లోపలకెళ్లిపోయాడాయన; కట్టుబట్టలతో కల్యాణిని నడివీధిలో 'దోషి'గా వొదిలేసి.

అంత దారుణంగా ఆయన ప్రవర్తించినా 'ఇదేమిటని' చూస్తున్న జనంలో వొక్కరంటే వొక్కరు పెదవి విప్పి అడిగిన పుణ్యాన్నపోలేదు.

పైగా, సాక్షులుగా నిలబడ్డ వాళ్లలో ఎక్కువ భాగం స్త్రీలే. సాటి స్త్రీ పైన పిడికెడు సానుభూతి అయినా చూపించలేదు వాళ్లల్లో వొక్కళ్లయినా.

సినీమా విడిచిపెట్టిన తర్వాత వెళ్లిపోయే ప్రేక్షకుల్లా ఎవరి దారిన వాళ్లు వెళ్లిపోయారు. ఏదారీ కనపడక. దిక్కుతోచని పక్షిలా మిగిలిపోయింది కల్యాణి నా ఎదుట.

అంతరాంతరాల్లో కళ్యాణి పట్ల నాకు గల ఎనలేని గౌరవానికి 'నీచత్వం' ఆపాదించి; నన్నే గాకుండా, ఏ పాపమూ ఎరుగని నిష్కళంకమైన కల్యాణిని కూడా దోషిని చేసి, దుమ్మెత్తిపోసి; రామచంద్రరావుగారూ, ఆయనతోపాటు ఆయన కండగా నిలబడ్డ గుడ్డిలోకవూ ఏకమై; నడివీధిలో, నిర్దాక్షిణ్యంగా, ఒంటరిదాన్ని చేసి, ఒదిలేసి వెళ్లిపోతే; సమయం ఒచ్చినప్పుడు, నిర్ణయం తీసుకోవాల్సొచ్చినప్పుడు, వల్లించిన ఆదర్శాలను గాలికి ఒదిలేసి; నామూలంగా భర్త అనుమానానికి గురయి నిండు బ్రతుకు బలయిపోయిన కల్యాణిని; నేనూ వొదిలేసి, నామానాన్న నేనూ వెళ్లిపోయే నీచత్వానికి పాల్పడలేకపోయాను.

అందరిలాగా ఆమెను 'గాలి'కి వొదిలేసి, నా ఆత్మ గౌరవాన్ని కించపరుచుకుని; ఈ మనుష్యుల పట్ల ఆమెలో నా మూలంగా కొద్దో గొప్పో మిగుల్చుకున్న ఆమె ఆత్మ విశ్వాసాన్ని హత్య చేయలేకపోయాను.

జరిగిన అవమానానికి, నేలకు తల దించుకుని, చెయ్యాల్సిందేమిటో తోచక, అచేతనంగా మిగిలిపోయిన కళ్యాణికి; నేనున్నానని ధైర్యం చెప్పే తోడూ నీడా కావలసొచ్చినప్పుడు; ఈ లోకానికి జడిసే పిరికి పందనయి, ఆత్మన్యూనతకి లోనుకాలేకపోయాను.

నా సంస్కారం మీద నాకున్న ఆత్మవిశ్వాసంతో, కల్యాణి ఎడల నాకు సంపూర్ణంగా వున్న పవిత్రమైన భావంతో; ఆమెకు నా చేతినందించినప్పుడు......

పునర్జీవించిన ఆమె చైతన్యం;

ఈ లోకంమీద ... బూజుపట్టిన దాని సాంప్రదాయంమీద ... 'తిరుగుబాటు' ప్రకటిస్తూ; విశాలమైన ఆమె కళ్లల్లో అఖండంగా వెలిగిన జ్యోతిని; చూసినప్పుడనిపించింది ... 'కళ్లున్న వాడొక్కడే' చూడతగ్గ అపూర్వ సుందర దృశ్యం అదని!

కొండంత ధైర్యంతో ...

చేయీ చేయీ కలిపి, వీధిలోకి అడుగుపెట్టిన మాకు ... వెలుతురుని ప్రసవించడానికి వేగిరపడే వేగుచుక్క జాజ్వల్యమానంగా ప్రకాశిస్తూ ... ఆ చీకట్లో మా కొత్త జీవితానికి వెలుగుబాట పరిస్తే;

తలుపు సందుల్లోంచి మమ్మల్ని చూస్తున్న 'లోకం' గుసగుసగా నవ్వుకుంది, ఏం చెయ్యడానికీ దమ్మూ ధైర్యంలేక.

''నవ్విపోదురుగాక ... మాకేటి వెరపు ...'' అనుకుంటూ — సాగిపోయాం ఇద్దరికిద్దరమూ... మేం ఏర్పరుచుకోబోతున్న; కొత్తలోకంలోకి ...

సరికొత్త జీవితంలోకి !!!

క్రిస్మస్ సందర్భంగా గాస్పెల్స్ మెసెంజర్స్ కల్చరల్ అకాడమీ వారు విజయవాడలోని క్షేత్రయ్య కళాక్షేత్రంలో ప్రదర్శించిన ''ఆడం అండ్ క్రైస్ట్'' నృత్యరూపకంలో క్రీస్తుపుట్టుక దృశ్యం. మేరీగా కుమారి ఆనీ కిరణ్మయి, జోసెఫ్‌గా శ్రీ రవిలని చిత్రంలో చూడవచ్చు.